సాక్షి ఖమ్మం

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



పట్టుబడితేనే ఆదాయం

ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా కేఎంసీకి రావాల్సిన ఆదాయానికి ఉద్యోగుల పట్టింపులేని తనంతో గండి పడుతోంది. 8లో



హృదయాలను గెలుచుకునేలా..

రాష్ట్రస్థాయి నాటిక పోటీల ద్వారా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటున్నారని మంత్రి తుమ్మల, నటుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం

33° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత కాస్త పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే గర్భగుడిలో స్వామి మూల విరాట్‌తోపాటు ఆలయంలో శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం చేశారు. అనంతరం తెలంగాణ, ఏపీ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్ రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

‘ధరణి’పై తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ సమీక్ష



కల్లూరులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కల్లూరు/తల్లాడ: కల్లూరు డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సమావేశమయ్యారు. ఆర్‌డీఓ కార్యాలయంలో శనివారం జరిగిన ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ధరణి పెండింగ్ సమస్యలపై ఆరా తీసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆతర్వాత బాలుర హాస్టల్‌ను తనిఖీ చేసి మెనూ అమలు, పరిసరాలను పరిశీలించగా పలుచోట్ల అపరిశుభ్రంగా ఉండడంతో వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డీఈఓను ఫోన్‌లో ఆదేశించారు. ఈసమావేశంలో ఆర్‌డీఓ రాజేందర్, తహసీల్దార్లు పాల్గొన్నారు. అలాగే, తల్లాడలోని బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఆతర్వాత జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు బోధనపై హెచ్ఎం ప్రసూన, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

సాక్ష్యాలు, వాంగ్మూలాల సేకరణే కీలకం



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ప్రతీ కేసులో నిందితులకు శిక్ష పడేలా కోర్టు డ్యూటీ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్లకు శనివారం ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ నేరస్తులకు శిక్ష పడేలా సాక్ష్యాలు, వాంగ్మూలాలను పక్కాగా సేకరించి కోర్టుకు సమర్పించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు కేసుల వివరాలు ఆరా తీస్తూ సాక్షుల కోర్టుకు హాజరయ్యేలా చూడాలని చెప్పారు. చార్జ్‌షీట్ దాఖలు చేసిన కేసుల్లో సమన్వయంతో పనిచేస్తే నేరస్తులకు శిక్ష పడుతుందని.. తద్వారా నేరాలను కట్టడి చేయొచ్చని తెలిపారు. ఆతర్వాత పెండింగ్ కేసులు, వారెంట్లు, సమన్ల జారీపై సమీక్షించారు. సీసీఆర్‌బీ సీఐ స్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో దాదాపు 6.50 లక్షల ఎకరాలకు నీరందించే సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతోపాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరచుగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎక్కడైనా సమస్య ఏర్పడితే పరిష్కరిస్తుండడంతో పనుల్లో వేగం పెరిగింది. ఈనెల 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి జిల్లాలోని పంపుహౌస్‌ల్లో మోటార్లను స్విచాన్ చేయనుండగా.. నాగార్జునసాగర్ ఆయకట్టుకు అవసరమైన సమయాన గోదావరి జలాలు అందుబాటులో వస్తాయి. పంపుహౌస్‌ల్లో మోటార్ల ట్రయల్ రన్‌ను ఆదివారం మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారు. – వైరా

కృష్ణమ్మ చెంతకు గోదావరి

- సీతారామ’తో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ
- కీలకంగా ఏన్కూరు లింక్ కెనాల్
- పరిహారం రాకముందే భూములిచ్చిన రైతులు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి నిరంతర పర్యవేక్షణ
- నేడు మంత్రుల నేతృత్వాన ములకలపల్లి మండలంలో ట్రయల్‌రన్





ఖమ్మం జిల్లా ఏన్కూరు వద్ద శరవేగంగా కొనసాగుతున్న రాజీవ్ సాగర్ లింక్ కెనాల్ పనులు

సాగునీటి కష్టాలు లేకుండా..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి జిల్లా సాగునీటి అవసరాలు తీర్చేందుకు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ఈ రెండింటి స్థానంలో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధకంగా సీతారామ ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చారు. ఎనిమిదేళ్లుగా ఈ పనులు కొనసాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రత్యేక దృష్టి సారించింది.

ముగ్గురు మంత్రుల పర్యవేక్షణ

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ ప్రాజెక్టుపై సమీక్షించగా.. జూన్ 13న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల వివరాలు, నిధులపై అధికారులు వెల్లడించిన వివరాల మేరకు బడ్జెట్‌లో సీతారామ ప్రాజెక్టుకు రూ.799 కోట్లు కేటాయించారు. అందులో పంపుహౌస్‌లు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు రూ.687 కోట్లు, సీతమ్మసాగర్ బ్యారేజీ, అనుబంధ పనులకు రూ.111 కోట్లు వెచ్చించనున్నారు. ఆపై పంపుహౌస్, టన్నెల్ పనుల పురోగతిని డిప్యూటీ సీఎం సహా మంత్రులు తరచూ పరిశీలిస్తున్నారు.

ఈ సీజన్‌లోనే నీరు ఇచ్చేలా..

ఈ వానాకాలం సీజన్‌లో సీతారామ ద్వారా కనీసం 1.50 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు నీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఏన్కూరు వద్ద రాజీవ్ కెనాల్ పూర్తయితే సాగర్ జలాలు అందుబాటులో రాని సమయాన ఈ నీరు వాడుకునే వీలుంటుంది. గోదావరి నదిపై ఆనకట్ట నుంచి రాజీవ్‌కెనాల్ వరకు నీటిని తీసుకెళ్లాలంటే మూడు చోట్ల ఎత్తిపోయాల్సి ఉంటుంది. దీంతో అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరులో 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు, ములకలపల్లి మండలం వీకే రామవరంలో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు, కమలాపురం పంప్‌హౌస్‌లో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటార్లే కాక 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు మోటార్లున్నాయి. తొలి దశలో ఒక మోటార్ నడిపించడం ద్వారా ఎన్నెస్పీ, వైరా, లంకాసాగర్ రిజర్వాయర్లకు నీరు సరఫరా చేస్తారు. ఇక యాతాలకుంట టన్నెల్ పనులు శరవేగంగా సాగుతుండడంతో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది. ఆపై జూలూరుపాడు, పాలేరు టన్నెళ్ల నిర్మాణం పూర్తయితే అన్ని మోటార్లు పూర్తిస్థాయిలో నడిపించి పాలేరు, ఖమ్మం,మధిర, పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల్లో పంటలకు నీరు అందిస్తారు. అలాగే ఇల్లెందుకు కూడా ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందించాలనే డిమాండ్ ఉంది. కాగా, ఆదివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం వద్ద పంపుహౌస్‌ల్లోని మోటార్ల ట్రయల్‌రన్‌ను ప్రారంభించనున్నారు.

ఏన్కూరు లింక్ కెనాలే ప్రధానం

సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు అందించాలంటే ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) కీలకం కానుంది. 18ఎల్ నంబర్‌తో నిర్మించే ఈ కెనాల్‌కు రూ.99.16 కోట్లు కేటాయించగా మే నెలలో పనులు ప్రారంభమయ్యాయి. తొమ్మిది కి.మీ. ఉండే ఈ కెనాల్ పనులు కేవలం నాలుగు నెలల్లోనే 8.60 కి.మీ. పూర్తికావడం విశేషం. భూసేకరణ సందర్భంగా రైతులకు పరిహారం అందకముందే కాల్వ తవ్వకానికి అనుమతించారు. ఈ కెనాల్ ద్వారా జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా ప్రాజెక్టు కింద 17 వేల ఎకరాలు, సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలవుతుంది. ప్రధాన కాల్వ నిర్మాణానికి 5.300 కి.మీ. వద్ద అడ్డంకిగా ఉన్న హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైపులైన్ అంశంపై గుజరాత్ రాష్ట్రంతో సంప్రదింపులు పూర్తయిన నేపథ్యాన మరో నెలలో కెనాల్ పూర్తిచేసేలా కాంట్రాక్టర్ పనుల్లో వేగం పెంచారు.



లింక్ కెనాల్ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (ఫైల్)



లింక్ కెనాల్ పనులపై ఆరా తీస్తున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి (ఫైల్)

రైలులో రామయ్య వద్దకు..

- భద్రాచలంతో దేశవ్యాప్త కనెక్టివిటీ.. ‘మల్కన్‌గిరి–భద్రాచలం’ రైల్వేలైన్‌తో హర్షాతిరేకాలు
- తొలిఫేస్‌లోనే పాండురంగాపురం నుంచి పనులు చేపట్టాలని విన్నపం



భద్రాచలం వ్యూ



పాండురంగాపురం రైల్వే స్టేషన్

భద్రాచలం: భద్రాచలం పరిసర ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కలకు తొలి అడుగు పడింది. దేశవ్యాప్తంగా భక్తుల రాకపోకలకు, వాణిజ్య, వ్యాపార రంగాల అభివృద్ధికి కీలకమైన భద్రాచలం రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా గోదావరికి అవతలి ఒడ్డున ఉన్న పాండురంగాపురం వరకు 173 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణానికి ఓకే చెప్పింది. దీంతో భక్తులు, ఇరు రాష్ట్రాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్లుగా పోరాటం

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి నేరుగా రైలు మార్గం ఉండాలని దశాబ్దాలుగా భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం వరకు రైలు మార్గంలో వచ్చి, అక్కడ నుంచి 45 కిలోమీటర్లు రోడ్డు మార్గం ద్వారా భద్రాచలం చేరుకుంటున్నారు. భద్రాచలం, సారపాకల నడుమ గోదావరి నదీ ప్రవాహం ఉండడంతో మణుగూరు మార్గంలో పాండురంగాపురం వద్దనున్న రైల్వే లైన్‌ను సారపాక వరకు పొడిగించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో 15.5 కిలోమీటర్ల లైన్ పొడిగింపునకు బడ్జెట్‌లో రూ.47.5 కోట్లు కేటాయించినా నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో సారపాక రైల్వేలైన్ కాగితాలకే పరిమితమైంది. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనూహ్యంగా ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలపడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మొదటి దశలోనే పాండురంగాపురం ‘లైన్’ పూర్తయితే

మల్కన్‌గిరి–భద్రాచలం రైల్వే లైన్‌కు సుమారు రూ.3,592 కోట్లు ఖర్చు అవుతుందని ఫైనల్ లోకేషన్ సర్వేలో తేలినట్లు తెలుస్తోంది. ఒడిశా నుంచి భద్రాచలం వరకు అత్యధికంగా ఈ రైల్వే లైన్ అటవీభూమిలో నుంచే వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం అటవీ శాఖ, పర్యావరణ ఇతర అనుమతులు కావాల్సి ఉంటుంది. రైల్వే లైన్ నిర్మాణం పలు విడతలుగా సాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తొలి ఫేస్‌లోనే పాండురంగాపురం నుంచి భద్రాచలం వరకు రైల్వే లైన్ పూర్తిచేయాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పాండురంగాపురం నుంచి సారపాక వరకు 15.5 కిలోమీటర్ల ప్రతిపాదన ఉండగా మరో 4 లేదా 5 కిలోమీటర్లను గోదావరి నది మీదుగా బ్రిడ్జి నిర్మాణం ద్వారా అనుసంధానం చేస్తే భద్రాచలానికి రైల్వేలైన్ వస్తుంది. రైల్వేలైన్ పూర్తికి కేంద్ర ప్రభుత్వం ఆరేళ్ల గడువు నిర్దేశించగా మొట్టమొదటే పాండురంగాపురం నుంచి పనులు చేపడితే దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలానికి భక్తులు రైల్వే మార్గం ద్వారా చేరుకునే అవకాశం వస్తుంది. భక్తుల రాక పెరిగి భద్రాచలం ఆధ్యాత్మిక, పర్యాటక కారిడార్‌గా మారే అవకాశం ఉంది. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమల అభివృద్ధితోపాటు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

బోధనకు మళ్లీ ఇక్కట్లే..

- జూనియర్ కాలేజీల్లో అరకొరగానే లెక్చరర్లు
- అధ్యాపకుల భర్తీకి ఎదురుచూపులు
- 83మంది గెస్ట్ లెక్చరర్లు అవసరమని నివేదిక



ఖమ్మంలోని బాలికల జూనియర్ కళాశాల

ఖమ్మం సహకారనగర్: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య కీలకం. అయితే, జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరతతో విద్యార్థులకు మెరుగైన విద్య అందక భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారనుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. 19 కాలేజీలు చాన్నాళ్లుగా కొనసాగుతున్నాయి. వీటిలో 354 అధ్యాపక పోస్టులు ఉన్నా 251మందే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 214మంది రెగ్యులర్ అధ్యాపకులు, 29మంది కాంట్రాక్ట్, ఎనిమిది మంది పార్ట్ టైం లెక్చరర్లు ఉన్నారు. మిగతా పోస్టుల ఖాళీతో బోధన సాఫీగా సాగడం లేదు. ఈ క్రమంలో ఖాళీ పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేసేందుకు అనుమతించాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

బదిలీలతో సమస్యలు

అన్ని ప్రభుత్వ శాఖల్లో మాదిరిగానే ఇంటర్మీడియట్ విద్యాశాఖలోనూ ఇటీవల బదిలీలు జరిగాయి. జిల్లా నుంచి 113మంది వరకు అధ్యాపకులు ఇతరచోట్లకు బదిలీ అయ్యారు. కానీ వీరి స్థానంలో 97మంది మాత్రమే రావడంతో గతంలో ఉన్న అధ్యాపకుల కొరత మరింత పెరిగినట్లయింది.

‘గెస్ట్’లపై స్పష్టత ఇస్తారా...

జిల్లాలో 83మంది గెస్ట్ లెక్చరర్లు అవసరమని అధికారులు గుర్తించారు. అయితే, నివేదిక ఇచ్చి రెండు నెలలు కావొస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గత నెల 31వ తేదీ వరకు గతంలో విధులు నిర్వర్తించిన వారినే కొనసాగించినా ఆ తర్వాత పొడిగింపు ఇవ్వకపోవడంతో వారంతా అయోమయంలో పడ్డారు. ఇంతలోనే గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్న కళాశాలల్లోకి సుమారు 18మంది అధ్యాపకులు బదిలీలపై ఇతర ప్రాంతాల నుంచి రాగా వీరిని పక్కనపెట్టారు. దీంతో ఏళ్లుగా పనిచేస్తున్న తమను అవసరమైన కళాశాలలకు కేటాయించాలని వారు కోరుతున్నారు.

కూసుమంచి కళాశాలకు నోటిఫికేషన్

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచికి ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. కళాశాల నిర్వహణకు తాత్కాలిక భవనాన్ని గుర్తించి ఈ ఏడాది నుంచే బోధనకు ఏర్పాట్లు చేశారు. ఈ కళాశాలలో మాత్రం గెస్ట్ లెక్చరర్లను తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. మిగతా కళాశాలల విషయమై మాత్రం స్పష్టత రావడం లేదు. ఇక ఖమ్మంలోని ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిని ఇన్‌చార్జ్‌గా ప్రిన్సిపాల్‌గా నియమించారు.

వేంసూరు.. తప్పని తిప్పలు

రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధరెడ్డి తన స్వగ్రామమైన వేంసూరు మండలం కందుకూరుకులో గతేడాది భవనాన్ని నిర్మించి జూనియర్ కళాశాల మంజూరు చేయించారు. అయినా ఇప్పటి వరకు ఆ కళాశాలలకు అధ్యాపకులను కేటాయించలేదు. దీంతో సత్తుపల్లి బాలుర జూనియర్ కళాశాల నుంచి వివిధ సబ్జెక్టు లఅధ్యాపకులను కందుకూరు కాలేజీకి సర్దుబాటు చేశారు. అయితే, ఆయా అధ్యాపకులు రెండు చోట్ల బోధించాల్సి వస్తుండడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

నివేదిక పంపించాం...



జిల్లాలోని కళాశాలల్లో అధ్యాపకుల కొరతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. జిల్లాలో 83మంది గెస్ట్ లెక్చరర్లు తీసుకోవాల్సి ఉంది. ఇన్నాళ్లు గెస్ట్ లెక్చరర్లు విధులు నిర్వర్తించిన కళాశాలలకు బదిలీపై రెగ్యులర్ అధ్యాపకులు వచ్చారు. దీంతో వారిని పక్కన పెట్టాం. ఈ విషయాన్ని సైతం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం 10.30గంటలకు భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురంలో సీతారామ ప్రాజెక్టు 2, 3వ పంపుహౌస్‌ల ట్రయల్ రన్‌ను వారు ప్రారంభిస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం వైరాకు చేరుకుని ఈనెల 15న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా...



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

వైఎస్సార్ కాలనీలో పర్యటించిన మంత్రి తుమ్మల

ఖమ్మం అర్బన్: ఖమ్మం 8వ డివిజన్‌లోని వైఎస్సార్ కాలనీలో సమస్యలన్నీ పరిష్కరిస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. డివిజన్‌లో శనివారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, మిగతా సమస్యలు కూడా పరిష్కరిస్తానని వెల్లడించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి, మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు లకావత్ సైదులు, మలీదు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెం మండలం జింకల తండా క్రాస్ వద్ద సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంత్రి తుమ్మలకు నాయకులు దేవ్‌సింగ్‌నాయక్, దీప్లానాయక్, బానోతు కోటేష్‌నాయక్, రాము నాయక్, రామ్మూర్తి వినతిపత్రం ఇచ్చారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వచ్చే రబీ నుంచి తృణధాన్యాల విత్తనాలు
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

రఘునాథపాలెం: అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి వెల్లడించారు. రఘునాథపాలెంలోని విత్తన గిడ్డంగి కార్యాలయంలో శనివారం ఆయన రైతులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేలా అందరూ సహకరించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడమే కాక అనుకోని ఘటనలు జరిగితే ప్రభుత్వం బాధ్యత వహిస్తుందని తెలిపారు. అదే ప్రైవేట్ కంపెనీల్లో కొనుగోలు చేస్తే రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందనే విషయాన్ని గమనించాలని సూచించారు. ఈమేరకు కార్పొరేషన్ నుంచే విత్తనాలు కొనడం ఆర్థిక పరిపుష్టికి సహకరించాలని తెలిపారు. వరి మాత్రమే కాక తృణధాన్యాల సాగును సైతం ప్రోత్సహిస్తూ వచ్చే రబీ సీజన్ నుంచి తృణ ధాన్యాల విత్తనాలను సరఫరా చేస్తామని వెల్లడించారు. కాగా, అధికారులు సైతం రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన సమాచారం ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ వినయ్, ఆర్ఎం ఎస్.భిక్షం, కాంగ్రెస్ నాయకులు బాలాజీనాయక్, మొక్క శేఖర్‌గౌడ్, నల్లమల వెంకటేశ్వరరావు, కొంటెముక్కల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, మూడు ముంతల గంగరాజుయాదవ్, జెర్రిపోతుల అంజని, బచ్చలికూర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమకు పునర్‌వైభవం

రాష్ట్ర చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు రాయల



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: గ్రానైట్ పరిశ్రమ మనుగడపై దృష్టి సారించి పునర్‌వైభవానికి కృషి చేద్దామని రాష్ట్ర చిన్న తరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. వివిధ జిల్లాల గ్రానైట్ అసోసియేషన్ల బాధ్యులు ఖమ్మంలో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా రాయల మాట్లాడుతూ క్వారీ లీజ్‌ల ప్రక్రియను సరళం చేయడం, పాత పద్ధతిలో తాత్కాలిక లీజ్‌ల మంజూరు, రాయల్టీ తగ్గింపుతోనే ఫలితం ఉంటుందనే విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. అసోసియేషన్ బాధ్యులు శ్రీనివాసరెడ్డి, చక్రధర్‌రెడ్డి, శరాబందు, పాటిబండ్ల యుగంధర్, పారా నాగేశ్వరావు, నరేంద్ర, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

19న పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో ఈనెల 19న చండీ హోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం నల్లగొండ జిల్లాకు చెందిన భక్తులు విరాళం అందించారు. మిర్యాలగూడెంకు చెందిన కె.సత్యనారాయణ – సూర్యకుమారి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో క్యాంటీన్ మూసివేత



పెద్దాస్పత్రిలో మూతబడిన క్యాంటీన్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని క్యాంటీన్‌ను మూసివేశారు. క్యాంటీన్ నిర్వాహకులు నెలనెలా రూ.4.18లక్షలు చెల్లించాల్సి ఉంది. అయితే ఏడు నెలలుగా వారు అద్దె చెల్లించకపోవడంతో సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. దీంతో అంత అద్దె చెల్లించడం తమ వల్ల కాదంటూ నిర్వాహకులు తప్పుకున్నారు. పెండింగ్ ఉన్న అద్దె చెల్లించాలని నిర్వాహకులను ఆదేశించగా.. త్వరలోనే క్యాంటీన్ నిర్వహణను టెండర్ ద్వారా కొత్త వారికి కేటాయిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు.

గుదిమళ్ల వాసికి డాక్టరేట్



సుధాకర్

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్లకు చెందిన చేకూరి సుధాకర్‌కు డాక్టరేట్ లభించింది. 'నెట్‌వర్క్ లైఫ్‌టైమ్ ఎన్‌హెన్స్‌మెంట్ టెక్నిక్స్ ఫర్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్' అంశంపై ఆయన ఆయన పరిశోధనాపత్రం సమర్పించగా హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. యుద్ధభూమి నిఘా, పర్యావరణ పర్యవేక్షణ, ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు హెచ్చరికలు తదితర అంశాలపై తన పరిశోధన సాగిందని వెల్లడించిన సుధాకర్.. భవిష్యత్‌లో సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు.

రామకృష్ణాపురం వాసికి...




నిరంజన్‌రావు

కామేపల్లి: కామేపల్లి మండలం రామకృష్ణాపురానికి చెందిన దీవెల నిరంజన్‌రావుకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ మార్పు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం తదితర అంశాలపై ఆయన సమర్పించిన పరిశోధన్మాకత సిద్ధాంత గ్రంధానికి ఢిల్లీ ఐఐటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో నిరంజన్‌రావు డాక్టరేట్ అందుకున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు


డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌గౌడ్



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

తిరుమలాయపాలెం: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ సూచించారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదుతో శనివారం ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొందరు వైద్యులు బయటకు వెళ్లినట్లు గుర్తించిన డీసీహెచ్‌ఎస్.. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన అందుబాటులో ఉంటూ అంకితభావంతో పని చేయాలని తెలిపారు. ఇక నుంచి బయోమెట్రిక్ విధానంలో హాజరునమోదు చేయనున్నట్లు చెప్పారు. అంతేకాక ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించినట్లు రాజశేఖర్ తెలిపారు. అనంతరం చికిత్స పొందుతున్న వారితో ఆయన మాట్లాడారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

పట్టుపడితేనే ఆదాయం

- కేఎంసీలో వసూలు కాని ట్రేడ్ లైసెన్స్ ఫీజులు
- గతేడాది రూ.2.56 కోట్లకు రూ.1.35 కోట్లే రాబడి
- ఈ ఏడాది రూ.2.83 కోట్లలో ఇప్పటివరకు రూ.80.05 లక్షలే వసూళ్లు
- అధికారుల పట్టింపులేనితనంతో కేఎంసీ ఆదాయానికి గండి



ఖమ్మంమయూరిసెంటర్: నగరాలు, పట్టణాల అభివృద్ధి ప్రధానంగా ఆదాయ వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు చెల్లించే పన్నులు, రుసుములు, లైసెన్సుల మంజూరు ద్వారా ఆదాయం అధికంగా వస్తుంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి, పంపు పన్నుల తర్వాత అత్యధికంగా ట్రేడ్ లైసెన్సుల ద్వారా ఆదాయం నమోదవుతోంది. అయితే, పన్నుల వసూలులో రాణిస్తున్న కేఎంసీ అధికారులు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడంలో మాత్రం విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ట్రేడ్ లైసెన్సుల ద్వారా నగరంలో రూ.3 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. అయినా ఆ స్థాయిలో లైసెన్సులు జారీ చేయకపోవడంతో కేఎంసీకి నష్టం వాటిల్లుతోంది.

పెరిగిన వ్యాపారం

ఖమ్మం నానాటికీ విస్తరిస్తుండడంతో పాటు నగరానికి వచ్చివెళ్లే వారితో వందలాది రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. అంతేకాక ప్రజల అవసరాలకు తగినట్లుగా కొత్త షాపులు వెలుస్తున్నాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో జనావాసాలు కన్నా వ్యాపార వాణిజ్య సముదాయాలే ఎక్కువగా ఉన్నాయి. గాంధీ చౌక్, కమాన్‌బజార్, కస్బాబజార్, వైరారోడ్డు, కాల్వొడ్డు, ట్రంక్‌రోడ్, జెడ్పీ సెంటర్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, కొత్తబస్టాండ్ బైపాస్ రోడ్డు, మమతా రోడ్డు ఇలా అన్ని ప్రాంతాల్లో వేలాది సంఖ్యలో షాపులు కనిపిస్తాయి. అయితే వీటిలో చాలా ప్రాంతాల్లో దుకాణాలను ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నడిపిస్తున్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయొద్దనే నిబంధనలు ఉన్నా యజమానులకు పట్టడం లేదు.

ఉద్యోగుల నిర్లక్ష్యం

వాణిజ్య, వ్యాపార సముదాయాల కొలతల ప్రకారం ట్రేడ్ లైసెన్సుల ఫీజులను నిర్దేశించి వసూలు చేయాలి. దుకాణం ముందు ఉన్న రోడ్డు వెడల్పు, దుకాణం విస్తరించి ఉన్న స్థలం ఆధారంగా ఫీజు ఖరారు చేయాలి. కానీ కేఎంసీలో కొందరు అధికారుల తీరుతో ఆదాయానికి గండి పడుతోంది. షాపుల కొలతలు తూతూ మంత్రంగా నమోదు చేయడం.. కొన్ని షాపులకు లైసెన్సులే జారీ చేయకపోవడంతో ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా కార్పొరేషన్ అధికారికంగానే రూ.కోటికి పైగా ఆదాయాన్ని కోల్పోతున్నట్లు అంచనా. ఇదంతా తెలిసినా అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇక ఫంక్షన్ హాళ్లు, ఆస్పత్రులకు సంబంధించి ఆస్తిపన్ను అంశం న్యాయస్థానంలో ఉండడంతో వాటికి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ఫీజులు రావడం లేదు. దీంతో అదనంగా మరో రూ.2 కోట్ల మేర ఆదాయాన్ని కేఎంసీ కోల్పోతుంది.

అంతంత మాత్రంగానే..

నగరంలో వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ యాక్ట్ ప్రకారం ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి. అయితే నగరంలో వ్యాపార సముదాయాలు 10 వేలకు పైగా ఉన్నా.. అధికారిక లెక్కల ప్రకారం 2024–25లో 5,856 దుకాణాలకు మాత్రమే లైసెన్స్ ఉంది. వీటి ద్వారా రూ.2.83 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఆర్థిక సంవత్సరం నాలుగు నెలలు గడిచినా రూ.80.05 లక్షలే రాబట్టగలిగారు. ఇక గత ఆర్థిక సంవత్సరం డిమాండ్‌లో సగం మేర కూడా వసూలు చేయలేక చతికిలబడ్డారు.

గత రెండేళ్లుగా ట్రేడ్ లైసెన్స్ వివరాలు.. (రూ.ల్లో)

ఏడాది	ట్రేడ్ లైసెన్సులు	డిమాండ్	వసూళ్లు	బ్యాలెన్స్
2023–24	5,336	2,56,28,000	1,35,70,00	1,20,58,000
2024–25	5,856	2,83,41,000	80,05,000	2,03,36,000

మాన్వికి అమెరికా ఆహ్వానం!

ఈనెల 24న టెక్సాస్‌లో నృత్య ప్రదర్శన



ఖమ్మంఅర్బన్: కూచిపూడి నృత్యంలో సత్తా చాటుతున్న ఖమ్మం శ్రీరామ్‌హిల్స్‌కు చెందిన చిన్నారి మాన్వి అమెరికాలో ప్రదర్శన ఇవ్వనుంది. మమత డెంటల్ కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ జి.అనితరావు కుమార్తె మాన్వి నాలుగేళ్ల వయస్సు నుంచే లక్ష్మీనారాయణ వద్ద కూచిపూడి నృత్యాన్ని అభ్యసిస్తూ ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. ఇందులో భాగంగా వివిధ అవార్డులు దక్కించుకుని.. గత ఏడాది డిసెంబర్ 24న నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి గిన్నిస్ బుక్‌లోనూ స్థానం సంపాదించింది. ఈమేరకు మాన్వి ప్రతిభను గుర్తించిన అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన 'వేణి స్కూల్ ఆఫ్ డ్యాన్స్' నిర్వాహకులు అక్కడ ప్రదర్శన ఇచ్చేందుకు ఆహ్వానించారు. దీంతో ఈనెల 24న అమెరికాలో ప్రదర్శన ఇచ్చేందుకు గాను మాన్వి సిద్ధమవుతోంది.

పోస్టల్ సేవలపై విస్తృతంగా ప్రచారం



మొక్క నాటుతున్న సూపరింటెండెంట్ వీరభద్రస్వామి, ఉద్యోగులు

మధిర: తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను ఉద్యోగులు విస్తృత ప్రచారం చేయాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి సూచించారు. మధిర సబ్ డివిజనల్ పోస్టల్ అధికారి వై.కోటేష్ ఆధ్వర్యాన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులతో సమానంగా పోస్టాఫీస్‌ల ద్వారా సేవలు అందుతున్నాయని.. ఎస్‌బీ, ఆర్‌డీ, ఎస్‌ఎస్‌ఏ పథకాలకు మంచి ఆదరణ వస్తోందని తెలిపారు. అలాగే, వృద్ధాప్య పెన్షన్లు, ఉపాధి హామీ పథకం నగదును కూడా పంపిణీ చేస్తున్న విషయాన్ని మరింత ప్రచారం చేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేకుండా అందుబాటులో ఉన్న పోస్టల్ పేమెంట్ బ్యాంకును ఉపయోగించుకునేలా చైతన్యపర్చాలని తెలిపారు. తొలిసారి మధిరకు వచ్చిన సూపరింటెండెంట్‌ను ఉద్యోగులు సన్మానించగా ఆయన కార్యాలయంలో మొక్క నాటారు.

ఉపాధ్యాయుల చుక్కానిగా యూటీఎఫ్



మాట్లాడుతున్న చావ రవి, పక్కన నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఏపీలోనే కాక తెలంగాణ ఏర్పడ్డాక కూడా ఉపాధ్యాయ ఉద్యమాలకు యూటీఎఫ్ చుక్కానిగా నిలుస్తోందని వెలుగొందుతోందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. యూనియన్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఖమ్మంలోని కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీ.వీ.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. తొలుత యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించాక రవి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని మేనేజ్‌మెంట్లు, కేడర్ల ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం వహించేలా 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నాటి నుండి ప్రభుత్వ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక నాటి ప్రభుత్వం సంఘాలను అణిచివేయాలనే ప్రయత్నించినా తమ యూనియన్ శక్తివంచన లేకుండా పోరాడిందని చెప్పారు. కాగా, జాతీయ విద్యావిధానం రాష్ట్రాల అధికారాలను హరించడమే కాక ప్రైవేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించేలా ఉందని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడంతో పాటుట అంగన్‌వాడీల్లో ప్రాథమిక విద్య అందించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని రవి డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చావ దుర్గాభవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావుతో పాటు బండి నర్సింహారావు, బుర్రి వెంకన్న, యూసుఫ్ సైదా, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, సుధాకర్ రావు, కె.గీత, బి.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి

బిషప్ సగిలి ప్రకాష్



ఖమ్మం జె సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: దళిత క్రైస్తవులకు ఎస్సీ కులాల హోదా ఇవ్వాలని ఖమ్మం మేత్రాసనం బిషప్ సగిలి ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఖమ్మంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక కలెక్టరేట్ ఎదుట ప్రార్థనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ దళితులు సిక్కు, జైన, బౌద్ధ మతం తీసుకున్న వారికి ఎస్సీ హోదా ఉందని తెలిపారు. 1950లో రాష్ట్రపతి విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం క్రైస్తవ మతం తీసుకున్న వారికి ఎస్సీ హోదా లేదని పేర్కొనటం సరికాదని పేర్కొన్నారు. ఇకనైనా పార్లమెంట్‌లో దళిత క్రైస్తవ బిల్లును ప్రవేశపెట్టడమే కాక జస్టిస్ రంగనాథ్ మిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ సెబాస్టియన్, ఫాదర్ ఎం.రాజు, ముత్తమాల ప్రసాద్, కొమ్ము ప్రసాద్, ఫాదర్ తప్పెట శౌరి, బత్తుల జయరాజు, సుందరి, పిల్లి సుందరి తదితరులు పాల్గొనగా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లోని భూగర్భ, ఓపెన్ కాస్ట్‌ల్లో ఖాళీగా ఉన్న చార్జ్‌హ్యాండ్, ఫోర్‌మెన్ ఇన్‌చార్జ్ (ఎలక్ట్రికల్) ఖాళీలకు కంపెనీలో పనిచేస్తున్న నాన్ డిప్లొమా వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వీరిని వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సీనియారిటీ ఆధారంగా ఖాళీల మేరకు ఎంపిక చేస్తామని తెలిపింది. ఈ సర్క్యులర్‌లో భాగంగా ముందుగా దరఖాస్తు చేసుకున్న వారు అర్హులని, రాత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

భర్తను అప్పగించాలని యువతి వినతి

ఖమ్మంమామిళ్లగూడెం: పెద్దల సాక్షిగా పెళ్లి చేసుకుని.. ఆరు నెలలకే అదనపు కట్నం కోసం వేధిస్తూ వెళ్లిపోయిన భర్తను తనకు అప్పగించి న్యాయం చేయాలని కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం గ్రామానికి చెందిన పూదరి స్వప్న కోరింది. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం జడలచింతలకు చెందిన కల్లెం నర్సింహారావు కుమారుడు సునీల్‌తో కులపెద్దల సమక్షాన ఖమ్మం ఐఎంఏ హాల్‌లో తనకు వివాహం జరిగిందని వెల్లడించింది. ఆ తర్వాత అదనపు కట్నం కోసం వేధిస్తూ వెళ్లిపోగా.. ఖమ్మంలో ఉంటున్న సునీల్ తనను దూరం పెడుతున్నాడని వాపోయింది. ఈ మేరకు అధికారులు స్పందించి తన భర్తను అప్పగించాలని కోరింది. సమావేశంలో స్వప్న కుటుంబీకులు రమ, రాము, రేవతి, వీరబాబు, గోపి పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

తల్లాడ: తల్లాడ హెచ్‌పీ గోదాం సమీపాన జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని నూతనకల్ గ్రామానికి చెందిన టి.కమలాకర్ బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కమలాకర్ తల, కుడి కాలికు తీవ్ర గాయాలు కాగా 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జాలిముడి ప్రాజెక్టులో మృతదేహం

మధిరరూరల్: మండలంలోని జాలిముడి ప్రాజెక్టు వద్ద వైరా నదిలో శనివారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక రైతులు ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వగా బ్లూకోట్ కానిస్టేబుల్ కోట ధర్మ మృతదేహాన్ని బయటకుతీశారు. ఇంతలోనే వైరా మండలం లింగన్నపాలెంకు చెందిన బోళ్ల కృష్ణ(55) నాలుగు రోజులుగా కనిపించడం లేదని ఫిర్యాదు చేసిన ఆయన బంధువులు చేరుకుని మృతదేహాన్ని చూసి కృష్ణ అని గుర్తించారు. కాగా, ఆయన మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మధిర రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



బూర్గు సురేష్ (ఫైల్)

వైరారూరల్: మండలంలోని విప్పలమడకకు చెందిన బూర్గు సురేష్(29) హైదరాబాద్‌లో విద్యుదాఘాతంతో గాయపడగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గ్రామంలో బాలకోటి, మణెమ్మ దంపతుల పెద్ద కుమారుడు సురేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన గత ఆదివారం తిరిగి వెళ్లాడు. అదే రోజు స్నేహితుల దినోత్సవం కావడంతో మిత్రులతో కలిసి బయటకు వెళ్లిన సురేష్ అక్కడ రోడ్డు పక్కన మూత్రవిసర్జన చేస్తుండగా 11 కేవీ అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఉండడంతో షాక్ గురై కింద పడినా ఎవరూ లేకపోవడంతో గుర్తించలేదు. అయితే, లైన్ ట్రిప్ కావడంతో అధికారులు సరఫరా పునరుద్ధరించగా అప్పటికీ అక్కడే పడి ఉన్న సురేష్‌కు మళ్లీ షాక్ కొట్టింది. దీంతో లైన్ ట్రిప్ కావడంతో తనిఖీ చేస్తూ వచ్చిన విద్యుత్ శాఖ సిబ్బంది ఆయనను గుర్తించి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సురేష్ శనివారం ఉదయం మృతి చెందగా విప్పలమడకకు మృతదేహాన్ని తీసుకురావడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

వివాహిత ఆత్మహత్య

బోనకల్: మండలంలోని రామాపురానికి చెందిన కొమ్మినేని సోందమ్మ(75)పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగు మందు తాగగా.. కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోందమ్మ శనివారం మృతి చెందింది. అనారోగ్య సమస్యలే ఆమె ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

బెదిరించిన కేసులో నలుగురి రిమాండ్

ఖమ్మంఅర్బన్: ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరుతో హోటళ్ల యజమానులను డబ్బుల కోసం బెదిరించిన నలుగురిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. భద్రాద్రి జిల్లాకు చెందిన గుగులోతు మోహన్‌రావు, బానోతు రామస్వామి, సపావత్ యువరాజ్, అజ్మీరా యువరాజుసింగ్ శుక్రవారం ఖమ్మంలోని ఓ హోటల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పేరిట తనిఖీలు చేసి యజమానిని డబ్బులు డిమాండ్ చేశారు. యజమాని ఫిర్యాదుతో వీరి నుంచి ఒక కారు, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రేక్షకుల హృదయాలను గెలుచుకునేలా నాటికలు

మంత్రి తుమ్మల, నటుడు శ్రీనివాస్‌రెడ్డి



దారుణం నాటికలోని ఓ సన్నివేశం



నాటికను తిలకిస్తున్న మంత్రి తుమ్మల, నటుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా సమాజ చైతన్యం కోసం సందేశాత్మక నాటికలను ప్రదర్శిస్తూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటున్నారని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీనటుడు యరమల శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నాటికలను మంత్రి తుమ్మల, నటుడు శ్రీనివాసరెడ్డి తిలకించారు. ఈమేరకు మంత్రి మాట్లాడుతూ నాటికలంటే తనకెంతో ఇష్టమని.. నెలనెలా వెన్నెల పేరుతో ప్రదర్శనలు ఇవ్వడమే కాక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అతర్వాత శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాతో స్వేచ్ఛ హద్దులు దాటి అపశృతులు చోటు చేసుకుంటున్న ఈ సమయంలో ఏడేళ్లుగా ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమం తన స్వస్థలంలో జరుగుతుండడంపై గర్విస్తున్నానని చెప్పారు.

రెండో రోజు.. మూడు నాటికలు

పోటీల్లో భాగంగా హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్ కళాబృందం ఆధ్వర్యాన పేద, ధనిక, మధ్య తరగతుల స్థితిగతులను వివరిస్తూ 'దారుణం', హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ ఆధ్వర్యాన 'ఆకాశం', ఖమ్మంకు చెందిన శ్రీ చందాల కేశవదాసు కళాపరిషత్ బాధ్యులు 'సంపద' నాటకాన్ని ప్రదర్శించగా నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, డాక్టర్ వేల్పుల విజేత, కురువెళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే



వైరా : సీఎం సభా స్థలి వద్ద ఎమ్మెల్యే రాందాస్, నాయకులు

వైరా/కొణిజర్ల: ఈనెల 15న వైరాలో జరగనున్న రైతు సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానుండగా.. సభాస్థలిని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సభను జయప్రదం చేసేలా రైతులు తరలిరావాలని కోరారు. ఆతర్వాత కొణిజర్లలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైరా సభకు కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ సభలో సీఎం సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్‌ను ప్రారంభించడమే కాక వైరాలో జరిగే సభలో రూ.2లక్షల రుణమాఫీ చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, విత్తనాభివృద్ధి సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, అన్వేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నల్లమల వెంకటేశ్వరరావు, కోసూరి శ్రీను, దొబ్బల సౌజన్య, శీలం వెంకటనర్సిరెడ్డి, మొక్కా శేఖర్‌గౌడ్, నంబూరి కనకదుర్గ, కట్ల సంతోష్, గోసు మధు, చెరుకుమల్లి రవి, కోసూరి శ్రీనివాసరావు, సూరంపల్లి రామారావు, రేణుక, వడ్డె నారాయణరావు పాల్గొన్నారు. కాగా, వైరాలో సభకు ఎంపిక చేసిన స్థలం, హెలీప్యాడ్ నిర్మాణ పనులను అడిషనల్ డీసీపీ ప్రసాదరావు పరిశీలించారు. వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, సీఐ సాగర్‌నాయక్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్ సాధించిన రామ్

పాల్వంచ: ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్వంచకు చెందిన విద్యార్థి ప్రతిభ చూపాడు. కేటీపీఎస్ సీ–కాలనీకి చెందిన స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య, ఏడీఈ ధనలక్ష్మి కుమారుడు చిలకబత్తిని రామ్‌నచ్చికేత్ నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫిడే చెస్ రేటింగ్‌లో 1,503 రేటింగ్ సాధించి సత్తా చాటాడు. గతంలో అండర్–11 విభాగంలో ఆరు ఇండియా చెస్ టోర్నమెంట్లు, మూడు అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లు, అంతర్జాతీయ రాపిడ్ జస్ట్ టోర్నమెంట్ ఆడి ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా కోచ్ అన్వర్, ప్రిన్సిపాల్ ఎంవీ రెడ్డి తదితరులు అభినందించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.